# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

బుధవారం

30 07 2025

సంపుటి 1 సంచిక 91

పేజీలు : 02

UDYAM / TS-09-0148996




## తెలంగాణ మంత్రులతో ఢిల్లీకి సీఎం రేవంత్

తెలంగాణ మంత్రులతో ఢిల్లీకి సీఎం రేవంత్ రిజర్వేషన్ల పై భారీ ధర్నా సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్రం వైఖరిని నిరసిస్తూ ఢిల్లీలో భారీ ధర్నా చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆగష్టు 5న మంత్రులతో కలిసి సీఎం ఢిల్లీకి వెళ్లనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, కేంద్రమంత్రులను కలవనున్నారు. అంతేగాకుండా బీసీ రిజర్వేషన్ల విషయంలో ఇండియా కూటమి మద్దతు కూడా కోరనున్నారు. 6న ధర్నా చేపట్టనున్నారు. - దశ, హైదరాబాద్

## ఆగస్టు 4 నుంచి 72 గంటల దీక్ష



**దశ, హైదరాబాద్:** బీసీ బిల్లు సాధన కోసం మూడు రోజులపాటు దీక్ష చేయడానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ,ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిర్ణయం తీసుకున్నారు. బీసీ బిల్లు ప్రాముఖ్యత చాటి చెప్పేందుకు ఆగస్టు 4, 5, 6 తేదీల్లో 72 గంటలపాటు దీక్ష చేపడతానని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకుని నిరాహార దీక్ష చేస్తామన్నారు. ఒకవేళ పర్మిషన్ ఇవ్వకుంటే ఎక్కడ కూర్చుంటే అక్కడే నిరాహారదీక్షకు సిద్ధమని స్పష్టంచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో అంబేద్కర్ విగ్రహ సాధన కోసం 72 గంటలు దీక్ష చేశాను. అప్పుడు కిరణ్ కుమార్ ప్రభుత్వం దిగివచ్చిందని గుర్తుచేసుకున్నారు. సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి మనం ఎలాగైనా బీసీ బిల్లు సాధించుకోవాలి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తున్న వారి అజెండా బీసీలకు రాజ్యాధికారం రావడం. బీసీ బిల్లు సాధనలో చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ పార్టీ అఖిలపక్షం ఏర్పాటు చేసి ఢిల్లీకి వెళ్లి పోరాటం చేయాలి.

## బీసీ రిజర్వేషన్ల కోసం
# రంగంలోకి కేసీఆర్?



**దశ, హైదరాబాద్ :**

బీసీ రిజర్వేషన్ల కోసం బీఆర్ఎస్ పోరుబాట పట్టనుంది. ఇందులో భాగంగానే బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రంగంలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతిని కలవాలని బీఆర్ఎస్ హై కమాండ్ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్‌లోని బీసీ నేతలతో కలసి ఢిల్లీలో రాష్ట్రపతిని కలవడానికి నయా ప్లాన్ చేశారు. ఆగస్ట్ 8వ తేదీన కరీంనగర్‌లో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నిర్వహించడానికి ప్లాన్ చేసింది. కరీంనగర్ సభ వేదికగా బీసీ రిజర్వేషన్లకు తాము అనుకూలంగా ఉన్నామనే స్పష్టమైన ప్రకటన ఇవ్వాడానికి బీఆర్ఎస్ హై కమాండ్ ఓ కార్యాచరణ రూపొందించింది. ఈ సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పాల్గొననున్నారు. బీసీ రిజర్వేషన్ల గురించి కాంగ్రెస్, బీజేపీ నేతల వైఖరిని కేటీఆర్ ప్రశ్నించనున్నారు.కాగా, బీసీ రిజర్వేషన్ల కోసం బీఆర్ఎస్ కార్యాచరణ రూపొందించింది. తెలంగాణ భవన్‌లో ఇవాళ (మంగళవారం జులై 29) బీఆర్ఎస్ బీసీ నాయకుల సమావేశం జరిగింది. కాంగ్రెస్‌కు పోటీగా ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతిని కలవాలని బీఆర్ఎస్ హై కమాండ్ నిర్ణయం తీసుకుంది. బీసీ రిజర్వేషన్ల కోసం ఆగస్ 8వ తేదీన కరీంనగర్‌లో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ నిర్వహించడనికి ప్లాన్ చేసింది.



# మాల్దీవులు దిగొచ్చింది..!

### చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడానికి సిద్ధం..
### హోటళ్లు బోసిపోయి... వ్యాపారం లేక బోర్డు తిప్పేసిన సంస్థలు

సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం లక్షద్వీప్ గురించి నరేంద్ర మోడీ గొప్పగా చెప్పారని మాల్దీవుల ప్రభుత్వం అడ్డగోలుగా వ్యాఖ్యలు చేసింది. భారత దేశంలో పర్యాటకం అత్యంత అద్వానంగా ఉంటుందని.. సముద్ర తీర ప్రాంతాలను సంరక్షించుకోలేదని.. అందువల్లే అక్కడికి పర్యాటకులు ఎక్కువగా రారని పిచ్చిపిచ్చిగా వ్యాఖ్యానించింది. అంతేకాదు ఆ వ్యాఖ్యలను సమర్థించుకుంటూ నెత్తి మాసిన చైనాతో అంటకాగింది. అయితే చైనా తో స్నేహం ఎంత ప్రమాదమో.. భారతదేశంలో విరోధం ఎంత ఇబ్బందికరమో మాల్దీవులకు తెలిసి వచ్చింది. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడానికి సిద్ధమైంది. వాస్తవానికి చైనా ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఉంది కాబట్టి తమకు సహకరిస్తుందని మాల్దీవుల ప్రభుత్వం భావించింది. కానీ అది అంత సులభం కాదని.. తన అవసరాల కోసం మాత్రమే చైనా తమను వాడుకుందని మాల్దీవులకు అర్థమైంది. ఈ లోగానే మాల్దీవుల నుంచి భారత్ తన సైన్యాన్ని వెనక్కి రప్పించింది. ఎప్పుడైతే భారతదేశం మీద మాల్దీవుల ప్రభుత్వం అడ్డగోలుగా వ్యాఖ్యలు చేసిందో.. అప్పటినుంచి మన దేశం నుంచి పర్యాటకులు ఆ ప్రాంతానికి వెళ్లడం మానేశారు.

**దశ, న్యూఢిల్లీ:**

మాల్దీవులు పర్యాటకపరంగా తీవ్రంగా నష్టపోయింది. హోటళ్లు బోసిపోయాయి. వ్యాపారం లేక ఇతర సంస్థలు బోర్డు తిప్పేశాయి. దీంతో మాల్దీవులు ఒక్కసారిగా నేల చూపులు చూడడం మొదలుపెట్టింది.చైనాతో స్నేహం ప్రమాదకరమని.. భారత దేశాన్ని దూరం పెట్టడం తెలివి తక్కువ నిర్ణయం అని యి మాల్దీవులకు అర్థమైంది. ఆలస్యంగా నైనా గుణపాఠం నేర్చుకున్న ఆ ప్రభుత్వం ఒక్కసారిగా మోడీ శరణుజొచ్చింది. అంతేకాదు మా దేశాన్ని కాపాడాలి అంటూ కాళ్ళ మీద పడింది. వాస్తవానికి మాల్దీవులతో భారత్ ఎప్పుడూ శత్రుత్వాన్ని కోరుకోలేదు. కానీ మాల్దీవులే అనవసరంగా గెలుక్కుంది. చివరికి అది ఎంత ఇబ్బందికరమో ఆ దేశానికి తెలిసి వచ్చింది. దీంతో భారత ప్రధాని నరేంద్ర మోడీని తమ దేశానికి ఆహ్వానించింది. రెండు రోజులపాటు నరేంద్ర మోడీ అక్కడ పర్యటిస్తారు. మాల్దీవులలో పర్యటిస్తున్న ప్రధానికి అక్కడి అధికారులు, ప్రభుత్వం, ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు. మాల్దీవ్ రాజధాని మాలే ప్రాంతంలో రక్షణ మంత్రిత్వ శాఖ భవనంపై ఏకంగా అతిపెద్ద నరేంద్ర మోడీ భారీ చిత్రపటాన్ని ప్రదర్శించారు. ఆయనకు ఘన స్వాగతం పలికారు.. మోడీకి అక్కడి సైనిక సిబ్బంది ఘన స్వాగతం పలికారు. మోడీ నడిచి వస్తుండగా.. రక్షణ శాఖ కార్యాలయం పై నరేంద్ర మోడీ భారీ చిత్రపటం కనిపిస్తున్న దృశ్యాలను కొంతమంది సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇప్పుడు అవి సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. బలమైన నాయకుడు ఉంటే ఎంతటి రాజ్యమైనా సరే కాళ్ళ కిందికి రావాల్సిందేనని నెటిజన్లు సోషల్ మీడియాలో పేర్కొంటున్నారు.



## జీఎస్ఎల్వీ F16 ఇస్రో నాసా

**దశ , శ్రీహరికోట :** ఇస్రో మరో ప్రయోగానికి సిద్ధమైంది. జీఎస్ఎల్వీ F16 రాకెట్ కౌంట్ డౌన్ ప్రారంభమైంది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ రెండో లాంచ్ పాడ్ నుంచి బుధవారం సాయంత్రం 5 గంటల 40 నిమిషాలకు F16 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ ప్రయోగంతో నిసార్ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపనున్నారు. భూ పరిశీలన కోసం ఇస్రో, నాసా సంయుక్తంగా నిసార్ ఉపగ్రహాన్ని అభివృద్ధి చేశాయి.నాసా జెట్ ప్రొపల్షన్ లాబొరేటరీ, ఇస్రో స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ సంయుక్తంగా అభివృద్ధి చేసిన NISAR.. ప్రపంచంలోనే మొట్టమొదటి డ్యూయల్ ఫ్రీక్వెన్సీ రాడార్‌తో భూమిని పరిశీలించే ఉపగ్రహం. ఇది L బ్యాండ్, Sబ్యాండ్ SAR టెక్నాలజీని ఉపయోగించి రాడార్ పల్స్‌ను భూమికి పంపించనుంది. నిసార్‌కు పగలు, రాత్రి అన్ని వాతావరణాల్లో ఫొటోలను తీసే సామర్థ్యం ఉంది.ఉపగ్రహ స్కాన్లు, భూకంపాలు, వరదలు, కొండచరియలు విరిగిపడటం, నేల తేమ, వ్యవసాయ నమూనాలలో మార్పులను ట్రాక్ చేయడంలో నిసార్ సాయపడనుంది. తీరప్రాంతం, కోత పెరుగుదలను కూడా ఇది అబ్జర్వ్ చేస్తుంది. దీంతో విపత్తుల నిర్వహణకు నిసార్ మరింత సాయం అవుతుందని నిపుణులు చెబుతున్నారు.

## మంత్రి ఉత్తమ్‌పై అలిగి వెళ్లిపోయిన
# మంత్రి కోమటిరెడ్డి..!
### ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసుకున్న వెంకటర్ రెడ్డి

దశ, హైదరాబాద్: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై మరో మంత్రి కోమటిరెడ్డి వెంకటర్ రెడ్డి అలిగి వెళ్లిపోయారు. మంగళవారం నాడు నాగార్జున సాగర్ డ్యామ్ గేట్లు ఎత్తడానికి హైదరాబాద్ బేగంపేట నుంచి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ హెలికాప్టర్‌లో బయల్దేరాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారం మంత్రులు కోమటిరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ ఉదయం 9 గంటలకే బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాత్రం 10 గంటలు అయినా అక్కడకు చేరుకోలేదు.తమను ఉదయం 9 గంటలకే రమ్మని చెప్పి.. 10 గంటలు దాటినా ఉత్తమ్ కుమార్ రెడ్డి రాకపోవడంపై కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకెంత సేపు ఆగాలి అంటూ అలిగి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత కొద్ది సేపటికి ఎయిర్‌పోర్టు చేరుకున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి.. అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి నాగార్జున సాగర్ బయల్దేరి వెళ్లారు. అక్కడ సాగర్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ క్రమంలోనే మంత్రి కోమటిరెడ్డి తన రెండు ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసుకున్నట్లు సమాచారం.








## తెలంగాణ హైకోర్టులో
# నలుగురు కొత్త జడ్జీలు
### నియామకానికి కేంద్రం ఆమోదం

**దశ, హైదరాబాద్:** తెలంగాణ హైకోర్టులో నలుగురు కొత్త జడ్జిల నియామకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు కోలీజియం సిఫారసులను ఆమోదించింది. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులుగా గాడి ప్రవీణ్‌కుమార్, చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గౌస్ మీరా మొహుద్దీన్ ప్రమాణం చేయనున్నారు.



# వనస్థలిపురంలో త్వరలో మినీ ఆడిటోరియం
### జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్

**దశ, ఎల్బీనగర్ :** జీహెచ్ఎంసీ ఎల్బీనగర్‌జోన్‌లోని వనస్థలిపురం డివిజన్ ప్రజలకు ఆధునిక హంగులతో ఓపెన్, మినీ ఆడిటోరియాలు త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. వనస్థలిపురం డివిజన్ లోని క్రిస్టియన్‌కాలనీలో మంగళవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనస్థలిపురంలో ఓపెన్ ఆడిటోరియం నిర్మిస్తున్నట్లు, ఇందులో కొంత భాగాన్ని మినీ ఆడిటోరియంగా నిర్మిస్తున్నట్లు దానికి స్థల పరిశీలన చేయడానికి వచ్చినట్లు తెలిపారు. సీఎం ఆదేశాలతో వనస్థలిపురంలో అత్యాధునిక ఆడిటోరియం భవనాన్ని నిర్మించడానికి నిధులు మంజూరు చేస్తామని ఆర్వీకర్ణన్‌చెప్పారు. అనంతరం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి డివిజన్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లికార్జున రావు, జీహెచ్ఎంసీ అధికారి అశోక్ రెడ్డి, సర్కిల్ -4 ఏసీపీ ప్రతాప్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎండీ రఫీ, ఏఈ విగ్నేశ్వరి, ఏయూ బీడీ శ్రీనివాస్, ఏఈ మణి, క్రిస్టియన్ కాలనీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను ఏ పార్టీ అయినా
# స్వాగతించాల్సిందే

**ఎమ్మెల్యే పి.సబితారెడ్డి**

**దశ, హైదరాబాద్:** అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఏ పార్టీ అయినా స్వాగతించాల్సిందేనని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. పథకాల విషయంలో విమర్శలు చేసుకుంటూ పోతే అర్హులైన పేద, బడుగు వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతుందని ఆమె వ్యాఖ్యానించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ మండలంలో కొత్తగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన రేషన్ కార్డులను బడంగ్‌పేట్‌లోని ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డితో కలిసి ఆమె పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రేషన్ కార్డులు మంజూరు చేయలేదనడం అవాస్తవమని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉన్నదని, బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే దాదాపు 90వేల కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఇక ముందు సైతం రేషన్‌కార్డుల జారీ ప్రక్రియను కొనసాగించాలని,



అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. గతంలో వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో అమలైన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ పథకాలను బీఆర్ఎస్ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ అలాగే కొనసాగించారని సబిత గుర్తు చేశారు.

## నీటిని విడుదల చేసిన మంత్రులు

మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ మంగళవారం నాడు నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసారు. ఐదు అడుగుల మేర మొత్తం 14 గేట్ల ద్వారా 78060 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరద నీటితో రసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు. ప్రస్తుత నీటి మట్టం 587.20 అడుగులు. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు. సాగర్ జలాశయం ప్రస్తుత నిల్వ 305.62 టీఎంసీలు. ఇన్ ఫ్లో 2,28,900 క్యూసెక్కులు. ఔట్ ఫ్లో 1,18,790 క్యూసెక్కులు. - దశ, నల్గొండ

